సాక్షి
వికారాబాద్

మంగళవారం । 1 । ఆగస్టు । 2023



శ్రమిద్దాం.. వారధి కట్టేద్దాం

వర్షాలు పడిన ప్రతిసారీ మండలంలోని స్టేషన్‌ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్య కాగ్నా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. 8లో▸



ఇళ్లు మంజూరు చేయండి

వర్షాల కారణంగా ఇళ్లు కూలిపోయిన వారందరికీ ఆర్థిక సాయం చేయాలని బీజేపీ నేత నదానంద్‌రెడ్డి కోరారు. 8లో▸



జోరందుకున్న వరినాట్లు

వర్షాలు కురుస్తుండడంతో నీటి వనరులు ఉన్న రైతులు వరినాట్లు వేయడంలో బిజీబిజీగా ఉన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

రేపు అథ్లెటిక్స్ సెలెక్షన్స్

తాండూరు టౌన్‌: పట్టణంలో బుధవారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెలెక్షన్స్ నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాండూరులోని పాత శాలివాహన కళాశాల మైదానంలో బుధవారం ఉదయం 9గంటలకు అథ్లెటిక్స్ సెలెక్షన్స్ ఉంటాయని తెలిపారు. అండర్ – 14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు 100 మీటర్లు, 400 మీటర్లు, జావెలిన్‌త్రోలో సెలెక్షన్స్ ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎస్సెస్సీ మెమో లేదా కుల ధ్రువీకరణ పత్రం లేదా జనన ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 89782 34447లో సంప్రదించాలని సూచించారు. ఆగస్టు 7న అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ జావెలిన్ త్రో డే సందర్భంగా వరంగల్‌లో రాష్ట్రస్థాయి ద్వితీయ అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, డీఈవో

వికారాబాద్ అర్బన్‌: ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఈఓ రేణుకా దేవితో కలిసి సోమవారం తన చాంబర్‌లో ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. నూతన ఆవిష్కరణల ద్వారా సృజనాత్మకతను వెలికితీసే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులు

పరిగి: పట్టణంలోని మహాత్మ జ్యోతిరావు పూలే సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుల పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నారు. బాలికల పాఠశాలలో సాంఘికశాస్త్రం, భౌతిక శాస్త్రం, బాలుర పాఠశాలలో రసాయనశాస్త్రం బోధించేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ రశ్మిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పీజీ, బీఈడీ అర్హతలు కలిగి ఉండి, ఆంగ్ల మాధ్యమంలో బోధన చేయాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 2వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, 3న డెమో, ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తామని తెలిపారు. వివరాలకు 9985877843, 9618135006 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పశువులకు టీకాలు వేయించాలి



పూడూరు: పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు రైతులు విధిగా టీకా వేయించాలని జిల్లా పశువైద్యాధికారి అనీల్‌కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని కంకల్, పూడూరు సబ్ సెంటర్లలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పశువులు వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు ప్రహ్లాద్, స్వేత పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్‌: జిల్లాలోని ఇంగ్లిష్ మీడియం గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కాంట్రాక్టు పద్ధతిన పాఠాలు బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను కాంట్రాక్టు పద్ధతిలో పని చేయడానికి అర్హత కలిగిన ఇంగ్లిష్ మీడియం అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఎంప్లాయ్‌మెంట్ శాఖలో పేరు నమోదు చేసుకొని ఉండాలన్నారు. రిజర్వేషన్ కేటగిరి వారికి వయసు పరిమితి ఐదు సంవత్సరాల సడలింపు ఉంటుందన్నారు. ఇట్టి పోస్టులకు లోకల్ గిరిజన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. రాత పరీక్ష ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. దరఖాస్తు ఫారాలు జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయం, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గిరిజన వసతి గృహాల్లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తులను జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయం వికారాబాద్‌లో ఆగస్టు 1 నుంచి 10వ తేదీ సాయంత్రం 5గంటలలోపు సమర్పించాలన్నారు.

అదుపు తప్పి.. గోడను ఢీకొట్టి
ఆటో బోల్తా

18 మంది విద్యార్థులకు గాయాలు

- డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగంతో ప్రమాదం
- ఆందోళనకు గురైన తల్లిదండ్రులు

కొడంగల్ రూరల్‌: రోజూ మాదిరిగానే స్నేహితులతో కలిసి సరదాగా కబుర్లు చెప్పుకొంటూ పాఠశాలకు బయల్దేరిన విద్యార్థులు.. ఊహించని ప్రమాదంతో భయభ్రాంతులకు గురయ్యారు. మరో మూడు నిమిషాలు గడిస్తే స్కూల్‌కు చేరుకోవాల్సి ఉండగా.. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం బారిన పడ్డారు. అతివేగంగా వచ్చిన వీరి వాహనం మలుపు వద్ద అదుపుతప్పి, గోడను ఢీకొట్టి బోల్తాపడింది. ఇందులో ప్రయాణిస్తున్న 18 మందికి గాయాలయ్యాయి. వీరి హాహాకారాలు విన్న స్థానికులు పరుగున వచ్చి ఆటోను పైకి లేపారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన సోమవారం ఉదయం కొడంగల్ పట్టణంలో చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

మున్సిపల్ పరిధిలోని బూల్కాపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ అశోక్ ఇదే గ్రామానికి చెందిన సుమారు 18మంది విద్యార్థులతో కొడంగల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు బయలుదేరాడు. ఆటోను అతివేగంగా నడపడంతో పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద అదుపు తప్పి గోడను ఢీ కొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో విద్యార్థులకు గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన వచ్చి క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముగ్గురికి తీవ్ర



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

గాయాలు కావడంతో తాండూరు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకొని బోరున విలపించారు. స్థానిక ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి వైద్యులకు ఫోన్ చేసి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఆస్పత్రికి వెళ్లి గాయపడిన వారిని పరామర్శించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఇళ్లకు పంపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పెను ప్రమాదం తప్పిందని తల్లిదండ్రులు పేర్కొన్నారు.



ఆస్పత్రిలో ఆవరణలో రోదిస్తున్న విద్యార్థులు

స్పీడుగా వెళ్లడంతోనే..



ఆటో స్పీడుగా నడపడం వల్లే బోల్తా పడింది. గ్రామం నుంచి వస్తున్న క్రమంలో మధ్యమధ్యలో ఆటో ఆగిపోయింది. మూల మలుపులో స్పీడ్ కంట్రోల్ కాక పోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది.

– వెన్నెల, 7వ తరగతి

స్కూల్‌కి కొద్ది దూరంలోనే..



గ్రామం నుంచి ఆటో బయలుదేరినప్పుడు మంచిగానే నడిపాడు. కొడంగల్‌కు రాగానే స్పీడు పెంచాడు. స్కూల్ కొద్ది దూరంలో ఉండగా ఆటోను అదుపు చేయలేకపోడాడు. దీంతో బోల్తా పడింది.

– బిందుజ, 7వ తరగతి

హాస్టళ్లు అధ్వానం!



సమస్యల పరిష్కారం కోసం ఇటీవల చౌడాపూర్‌లో ఆందోళన చేస్తున్న కొత్తపల్లి హాస్టల్ విద్యార్థులు

వసతి గృహాల్లో పారిశుద్ధ్య లోపం

- విద్యార్థులకు అందని పౌష్టికాహారం
- మెనూ పాటించని వార్డెన్లు
- పర్యవేక్షణను గాలికి వదిలేసిన ఉన్నతాధికారులు
- కలెక్టర్ వద్దకు చేరిన సమస్యల చిట్టా

వికారాబాద్‌: సంక్షేమ హాస్టళ్లలో పరిస్థితులు రోజు రోజుకూ అధ్వానంగా మారుతున్నాయి. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.. సన్నబియ్యంతో అన్నం, కూరగాయలతో పౌష్టికాహారం అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా..వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. సర్కారీ వసతి గృహాల్లో ఎక్కడా మెనూ పాటించడం లేదు. అనేక హాస్టళ్లు పారిశుద్ధ్య సమస్యతో సతమతమవుతున్నాయి. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇటీవల చౌడపూర్ మండలం కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులు సుమారు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి నడిచి వచ్చి నిరసన వ్యక్తంచేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. మంచి భోజనం పెట్టమని అడిగితే వార్డెన్ తమను దుర్భాషలాడుతున్నారని ఆరోపించారు. ఇలా ఏ హాస్టల్ చూసినా సమస్యలు తాండవిస్తుండగా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

పర్యవేక్షణ గాలికి..

హాస్టళ్లలో పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. జిల్లాలో సోషల్ వెల్ఫేర్, బీసీ, ఎస్టీ, మైనార్టీ వెల్ఫేర్, స్త్రీశిశు సంక్షేమం ఇలా ఐదు కేటగిరీలకు చెందిన వసతి గృహాలున్నాయి.ఇందులో పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ కలిపి మొత్తం వంద వరకు కొనసాగుతున్నాయి. పైఐదు శాఖలకు సంబంధించి ఐదుగురు జిల్లా అధికారులు ఉన్నారు. వీరిలో ఒక్కొక్కరు కనీసం 20 వసతి గృహాలను సైతం పర్యవేక్షించలేకపోతున్నారు. విద్యార్థులు ధర్నాలు, ఆందోళన బాట పట్టే వరకు వీరికి సమస్యలు తెలియని దుస్థితి నెలకొంది. తమ దృష్టికి వచ్చిన చిన్నచిన్న సమస్యలను సైతం పరిష్కరించడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. వార్డెన్ల నుంచి మామూళ్లకు అలవాటు పడిన అధికారులు ఇలా పర్యవేక్షణ గాలికొదిలేస్తున్నారని.. తాము చెప్పినా కూడా ఫలితం ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరోపణల నేపథ్యంలో..

వారం రోజులపాటు వరుసబెట్టి కురిసిన వర్షాలతో పాటు ఇటీవల సంక్షేమ హాస్టళ్లపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ నారాయణరెడ్డి స్పందించారు. అన్ని హాస్టళ్లను సందర్శించి, సమస్యలపై నివేదికలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో టెలీకాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి వసతి గృహాల స్థితిగతులను ఆరా తీశారు. దీంతో జిల్లాలోని అన్ని హాస్టళ్లకు సంబంధించిన సమస్యల చిట్టా ఆయన వద్ద ఉంది. అయితే హాస్టళ్లను సందర్శించిన జిల్లా స్థాయి అధికారులు, వార్డెన్లు సమస్యలను కలెక్టర్‌కు నివేదించలేదని తెలుస్తోంది. కేవలం మరమ్మతులు తదితర సమస్యలు మాత్రమే వివరించినట్లు సమాచారం. ఇతర ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తే తమ తోటి ఆఫీసర్లయిన సంక్షేమ హాస్టళ్ల పర్యవేక్షణ అధికారులపై ఫిర్యాదు చేసినట్లవుతుందని భావించి, అసలు పరిస్థితిని దాచి ఉంచారని సమాచారం. ఇదిలా ఉండగా హాస్టళ్లలో తాత్కాలిక మరమ్మతులకు సంబంధించి అంచనాలు సిద్ధం చేసి పంపితే నిధులిస్తామని, వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ ఇంజినీర్లను కలెక్టర్ ఆదేశించారు.



ప్రజావాణిలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మరమ్మతులు చేయండి

- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్‌: వర్షాలు పడుతున్నందున ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను పరిశీలించిన అనంతరం ఉన్న వాటికి మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. భవనాలకు మరమ్మతులు చేయాల్సి ఉంటే అంచనాలు తయా రు చేసి పంచాయతీ రాజ్ ఈఈకి పంపాలని సూ చించారు. నిధులు విడుదలయ్యేలోపు తాత్కాలిక మరమ్మతులు చేయాలని ఆదేశించారు. అనంతరం తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ముద్రించిన గ్రూప్ –2 స్టడీ మెటీరియల్‌ను అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి మల్లేశంతో కలిసి ఆవిష్కరించారు.

ప్రజావాణిలో 123 ఫిర్యాదులు

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 123 దరఖాస్తులు వచ్చాయి. వాటిని ఆయా శాఖల అధికారులకు అప్పగించారు.

సపోర్ట్ తీగ.. కాల నాగై..



రాజిరెడ్డి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- విద్యుదాఘాతంతో రైతు మృతి
- మర్పల్లి మండలం బూచన్‌పల్లిలో ఘటన

మర్పల్లి: విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందిన సంఘటన బూచన్‌పల్లిలో సోమవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబం, పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన లసుంపురం రాజిరెడ్డి(52) తనకున్న మూడెకరాల్లో వ్యవసాయ చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పత్తి పంటకు క్రిమి సంహారక మందు పిచికారీ చేసేందుకు ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. కరెంట్ మోటారును స్టార్ట్ చేసేందుకు వెళ్తుండగా కాలు జారి అదుపు తప్పడంతో.. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం సపోర్ట్ తీగను పట్టుకున్నాడు. సదరు వైర్‌కు కరెంటు సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు ఎలియాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మర్పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంతో అమాయక రైతుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని, బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ డిమాండ్ చేశారు.

ఎండోమెంట్ నుంచి తొలగించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని ముత్యాల ధర్మశాలను ఎండోమెంట్ శాఖ నుంచి తొలగించాలని ఎమ్మెల్యే ఆనంద్ దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కోరారు. సోమవారం వికారాబాద్ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులతో కలిసి ఆయన మంత్రిని, ఎండోమెంట్ కమిషనర్‌ను కలిశారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు నర్సింలు, విజయ్ కుమార్, మాణిక్‌ప్రభు, శ్రీరాములు, వేణుగోపాల్, మాణిక్యం, రఘునందం పాల్గొన్నారు.

అవధుల్లేని ఆనందం

- ఆర్టీసీ విలీన ప్రకటనపై కార్మికుల సంతోషం
- జిల్లాలోని మూడు డిపోల్లో 1,150 మందికి లబ్ధి

వికారాబాద్‌: ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం అధికారులతో సబ్ కమిటీ వేసి విధి విధానాలు రూపొందిస్తామని మంత్రి కేటీఆర్ ప్రకటించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో విలీన బిల్లును ప్రవేశ పెట్టనున్నట్లు ప్రకటించారు. దీంతో ఆర్టీసీ కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలోని



పరిగి, వికారాబాద్, తాండూరు డిపోల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు ఇకపై ప్రభుత్వ ఉద్యోగులుగా మారనున్నారు. తాండూరు డిపోలో 450మంది, పరిగి డిపోలో 400మంది, వికారాబాద్ డిపోలో 300 మంది ఆర్టీసీ కార్మికులకు లబ్ధి చేకూరనుంది.

శుభ పరిణామం



ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలంటూ తాము దశాబ్ద కాలంగా పోరాటలు చేశాం. ప్రభు త్వ నిర్ణయంతో మా కల సాకారమైంది. ఇది నిజంగా సంతోషించ దగ్గ విషయమే. అయితే ప్రభుత్వం రూపొందించే విధి విధానాల్లో కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలి.

– శ్రీనివాస్, కండక్టర్, పరిగి డిపో

ప్రభుత్వానికి ధన్యవాదాలు



ప్రభుత్వం తీసుకున్న విలీన నిర్ణయం ఎంతో గొప్పది. ఎన్నో రోజుల మా కల నెరవేరింది. ఎట్టకేలకు మా పోరాటం ఫలించింది. ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వానికి రుణపడి ఉంటారు. అయితే జాప్యం చేయకుండా విధి విధానాలు రూపొందించి అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశ పెట్టాలి.

– శేఖర్, డ్రైవర్

అసమ్మతి సెగలు

- కల్వకుర్తి బీఆర్ఎస్‌లో అంతర్గత కుమ్ములాటలు
- ఎమ్మెల్యే జైపాల్‌పై తిరుగుబావుటా
- అసమ్మతి నేతల రహస్య సమావేశం
- టికెట్ ఇస్తే ఓడిస్తామంటూ అల్టిమేటం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌పై సొంత పార్టీ నేతలే తిరుగుబావుటా ఎగరేస్తున్నారు. ఇప్పటికే ముఖ్య నేతలతో పాటు క్షేత్రస్థాయిలోని లీడర్లు సైతం రెండు వర్గాలుగా చీలిపోయారు. తరచూ బహిరంగ విమర్శలతో పాటు బాహాబాహికి దిగుతున్నారు. ఎన్నికల గడువు సమీపిస్తుండటం, పార్టీలో అసమ్మతి రాగాలు, అంతర్గత కుమ్ములాటలు అధికమవుతుండటం అధికార బీఆర్ఎస్‌కు తలనొప్పిగా మారింది. క్షేత్రస్థాయిలో ఇంత జరుగుతున్నా అధిష్టానం ఇప్పటి వరకు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం.. నష్టనివారణ చర్యలకు పూనుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.

తారాస్థాయికి చేరిన విభేదాలు

కల్వకుర్తి నియోజకవర్గం 1989లో ఏర్పడింది. ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా జైపాల్ యాదవ్ ఇప్పటికే మూడుసార్లు విజయం సాధించారు. (1999, 2009లో టీడీపీ నుంచి, 2018లో బీఆర్ఎస్ నుంచి) ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత కల్వకుర్తి వేదికగా పార్టీ సమావేశం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరయ్యేందుకు రాగా.. ఎమ్మెల్యే వర్గీయులు అడ్డుకున్నారు. అప్పటి నుంచి ఇద్దరి మధ్య ప్రారంభమైన విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. పార్టీ ముఖ్య నేతలే కాదు క్షేత్రస్థాయిలోని ప్రజాప్రతినిధులు, నాయకులు సైతం రెండు వర్గాలుగా విడిపోయారు. కడ్తాల్ జెడ్పీటీసీ దశరథనాయక్, ఆమనగల్లు జెడ్పీటీసీ అనురాధ సహా మెజార్టీ ఎంపీటీసీలు, సర్పంచులు జైపాల్ యాదవ్ వర్గంలో కొనసాగుతుండగా, కడ్తాల్ ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్, ఆమనగల్లు ఎంపీపీ అనిత ఎమ్మెల్సీ వర్గంలో కొనసాగుతున్నా రు. పలు సందర్భాల్లో ఇరు వర్గాలు పరస్పర దాడు లు చేసుకున్న విషయం తెలిసిందే. నియోజకవర్గంపై పట్టుకోసం ఇరు వర్గాల నేతలు ప్రయత్నిస్తున్నారు.

తరచూ ఎమ్మెల్సీ సమావేశాలు

ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్యే జైపాల్‌కు వ్యతిరేకంగా వేగంగా పావులు కదుపుతున్నారు. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేయాలని భావిస్తున్నారు. తరచూ నియోజకవర్గంలోని ముఖ్య నేతలతో సమావేశం అవుతున్నారు. ఈ క్రమంలో తాజాగా ఆదివారం కందుకూరులోని ఓ ఫాంహౌస్ వేదికగా ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలకిషన్‌సింగ్, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల్ వెంకటేశ్ (స్వతంత్ర అభ్యర్థి) సహా సుమారు 250 మంది ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు టికెట్ ఇవ్వొద్దని, తమ విజ్ఞప్తిని కాదని టికెట్ ఇస్తే ఓడించి తీరుతామని అల్టిమేటం జారీ చేశారు.

చెక్‌పెట్టే వ్యూహంలో ఎమ్మెల్యే వర్గం

ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందిన కడ్తాల్ జెడ్పీటీసీ ఇదే సమయంలో మరో కొత్త అంశాన్ని తెరపైకి తెచ్చారు. ఎమ్మెల్సీ వర్గానికి చెక్ పెట్టే వ్యూహంలో భాగంగానే ఆయన గిరిజన అంశాన్ని తెరపైకి తెచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలో మొత్తం 212 తండాలుండగా, వీటిలో గిరిజన ఓటు బ్యాంకు 50 వేలకుపైగా ఉంది. ప్రస్తుతం ముగ్గురు ఎంపీపీలు, ఇద్దరు జెడ్పీటీసీలు, ఇద్దరు వైస్ ఎంపీపీలు, 60 మంది సర్పంచ్‌లు, 15 మంది ఎంపీటీసీలు, ఆరుగురు మున్సిపల్ కౌన్సిలర్లు గిరిజన అభ్యర్థులే కొనసాగుతున్నారు. ఓటు బ్యాంకుతో పాటు క్షేత్ర స్థాయిలో బలమైన కేడర్ ఉన్న లంబాడీ సామాజిక వర్గానికి ఈసారి అవకాశం కల్పించాలని కోరుతూ ఆయన ఈ మేరకు సోమవారం తన నివాసంలో ఆయా ప్రజాప్రతినిధులు,గిరిజన సంఘాల ప్రతినిధులతో సమావేశమై తీర్మానించడం హాట్ టాపిక్‌గా మారింది.

పోటీకి సై అంటున్న ఆశావహులు

సిట్టింగ్ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మళ్లీ తానే పోటీ చేయబోతున్నట్లు ప్రకటించారు. అధిష్టానం ఆశీస్సులతో పాటు పార్టీ కేడర్ మద్దతు తనకే ఉందని, ఎమ్మెల్యే టికెట్ తనకే లభిస్తుందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోయేది తానేనని ప్రచారం చేసుకుంటున్నారు. ఇదే నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే కిష్టారెడ్డి తనయుడు ఎడ్మ సత్యం కూడా పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆయనతో పాటు వెల్దండ మండల బీఆర్ఎస్ నేత శ్రీనివాసరెడ్డి సైతం టికెట్ ఆశిస్తున్నారు. ఎవరికి వారు గ్రూపులుగా విడిపోయి కార్యక్రమాలు చేపడుతుండడం విశేషం.

క్లుప్తంగా

పేద కుటుంబాలను ఆదుకుంటాం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

దోమ: గ్రామాల్లోని పేద కుటుంబాలను ఆదుకునేందుకు తాము ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన కే నర్సింహులు, కుల్సుంబీ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం స్థానిక నేతలను పంపి బాధిత కుటుంబాలకు రూ. 5 వేల చొప్పున సాయం చేశారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మయ్య ముదిరాజ్, కో ఆప్షన్ సభ్యుడు ఖాజాపాష, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ యాదయ్యగౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్ గౌడ్, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, గౌస్, మైను పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్య



హారిక(ఫైల్)

నవాబుపేట: కడుపు నొప్పి భరించలేక బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కద్చర్ల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని కద్చర్ల గ్రామానికి చెందిన లావణ్య, మాధవులు దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు హారిక మోమిన్‌పేటలోని కేజీబీవీలో పదో తరగతి పదువుతోంది. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. పలుమార్లు ఆస్పత్రులకు తీసుకెళ్లారు. ఆదివారం మళ్లీ కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులు బాలికను పాఠశాల నుంచి ఆసుపత్రికి అక్కడి నుంచి ఇంటికి తీసుకొచ్చారు. అనంతరం వారు పొలానికి వెళ్లారు. అదే సమయంలో హారికకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తల్లి లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భరత్‌భూషణ్ తెలిపారు.

హత్య కేసు నిందితుడికి జీవిత ఖైదు

తాండూరు: యాభై రూపాయల కోసం మహిళను చంపిన యువకుడికి జీవిత ఖైదు, రూ.1,000 జరిమానా విధిస్తూ సోమవారం వికారాబాద్ జిల్లా కోర్టు తీర్పు వెలువరించింది. తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపిన వివరాలు.. పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాషాపూర్ తండాకు చెందిన రాథోడ్ విలాస్ ఆకతాయిగా తిరిగేవాడు. తండాలో ఉన్న వారిని డబ్బులు అడుగుతూ జల్సాలు చేసేవాడు. ఈ క్రమంలో గతేడాది మే 2న తండాకు చెందిన మంగ్లీబాయి(55) ఇంటికి వెళ్లి 50 రూపాయలు ఇవ్వమని వెళ్లాడు. తన వద్ద లేవని మంగ్లీబాయి చెప్పడంతో భర్త ఉండగానే హత్య చేశాడు. మృతురాలి కుమారుడు రాథోడ్ గోపాల్ పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై అబ్దుల్ రవూఫ్ కేసు నమోదు చేశారు. రూరల్ సీఐ రాంబాబు దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్ జడ్జి కే సుదర్శన్ నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.1,000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని డీఎస్పీ తెలిపారు.

శ్రమిద్దాం.. వారధి కట్టేద్దాం

వర్షాలు పడిన ప్రతిసారీ కాగ్నా నది ప్రజా రవాణాకు అవరోధంగా మారుతోంది. ఈ సమస్య ఏళ్ల తరబడి వెంటాడుతోంది. ఇంకెంత కాలం ఈ బాధలు అనుకున్న దోర్నాల్ గ్రామ యువకులు శ్రమిద్దాం.. వారధి కట్టేద్దాం అనే నిర్ణయానికి వచ్చారు. సోమవారం చేయి చేయి కలిపి స్టేషన్‌ధారూరు – దోర్నాల్ గ్రామాల మధ్య కాగ్నా నదిపై తాత్కాలిక వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

కాగ్నా నదిపై తాత్కాలిక వంతెనకు నడుం బిగించిన దోర్నాల్ యువకులు



కాగ్నా నదిపై తాత్కాలిక రోడ్డుపై రాళ్లు వేస్తున్న దోర్నాల్ యువకులు

ధారూరు: మండలంలోని స్టేషన్‌ధారూరు – దోర్నాల్ గ్రామాల మధ్య కాగ్నా నది ప్రవహిస్తోంది. వర్షాలు పడిన ప్రతి సారీ ఇక్కడ ప్రవాహం ఉధృతంగా ఉంటుంది. ఈ సమయంలో నది దాటడం చాలా కష్టం. నది అవతల ధారూరు మండలంలోని 23 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల ప్రజలు ఏ చిన్న అవసరం పడినా ఈ కాగ్నా దాటాల్సిందే. ఈ గ్రామాలే కాకుండా పరిగి, బొంరాస్‌పేట్, యాలాల మండలాల్లోని 33 గ్రామాల ప్రజలు ధారురు రావాలన్నా, తాండూరు, వికారాబాద్, హైదరాబాద్ వెళ్లాలన్నా ఇదే దగ్గరి దారి. నిత్యం ఈ మార్గంలో పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు ఉంటాయి. అయితే కాగ్నా నదిపై వంతెన ఉండేది. అది దెబ్బతినడంతో దాన్ని కూల్చివేసి నూతన నిర్మాణం చేపట్టారు. 2017లో పనులు ప్రారంభించినా ఇప్పటికీ అతీగతీ లేదు. కొత్త వంతెన అందుబాటులోకి వచ్చే వరకు నదిపై తాత్కాలికంగా వంతెన నిర్మించారు. అక్కడ నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటోంది. దీంతో వాహనాల రాకపోకలు కష్టంగా మారింది. అంతే కాకుండా నీటి ప్రవాహానికి రోడ్డుపై మట్టి మొత్తం కొట్టుకుపోయినట్లు ప్రజలు తెలిపారు. దీంతో పైపులపై నడవడం, వాహనాలు వెళ్లడం కష్టంగా ఉందని తెలిపారు. ఇదిలా ఉండగా యాలాల మండలం రాస్నం గ్రామానికి చెందిన అంజిలయ్య ఆదివారం కాగ్నానదిలో కొట్టుకపోయి ప్రాణాలతో బయటపడ్డన విషయం తెలిసిందే. వంతెన నిర్మాణం ఇప్పట్లో పూర్తి అయ్యే అవకాశాలు లేకపోవడం, వర్షాల కారణంగా నీటి ప్రవాహం తగ్గకపోవడంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యకు ఎలాగైనా తాత్కాలిక పరిష్కారం కనుగొనాలని భావించిన దోర్నాల్ గ్రామ యువకులు శ్రమదానం చేసి వంతెన ఎత్తు పెంచే పనులు చేపట్టారు. దాదాపు 20 మంది వరకు శ్రమించి రాళ్లు, మట్టి పోసి వాహనాలు, ప్రజలు వెళ్లేందుకు ఏర్పాటు చేస్తున్నారు.

ఇళ్లు మంజూరు చేయండి



లింగంపల్లిలో ఇళ్లు కూలిపోయిన వారికి ఆర్థిక సాయం చేస్తున్న బీజేపీ నాయకులు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానంద్‌రెడ్డి
- వర్షాలకు ఇళ్లు కూలిపోయిన వారికి ఆర్థిక సాయం

నవాబుపేట: ఇటీవల వర్షాల కారణంగా ఇళ్లు కూలిపోయిన వారందరికీ ప్రభుత్వ రూ. 3లక్షల ఆర్థిక సహాయం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానంద్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని లింగపల్లి, అత్తాపూర్ గ్రామాల్లో వర్షాలకు కూలిన ఇళ్ల బాధితులకు చేవెళ్ల నియోజకవర్గ నాయకులు తులసీరామ్, విజయ్‌కుమార్ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాలతో చాలా మంది ఇళ్లు కూలిపోయాయన్నారు. వారందరికీ ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. అలాగే పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు శ్రీధర్, విఠల్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబాన్ని పోషించే బాధ్యత భర్తదే

చీఫ్ లీగల్ డిఫెన్స్ న్యాయవాది వెంకటేశ్



మాట్లాడుతున్న న్యాయవాది వెంకటేశ్

అనంతగిరి: భార్య, పిల్లలను పోషించే బాధ్యత భర్తదేనని, వారి బాగోగులు చూడకపోతే భర్త నుంచి మెయింటెనెన్స్ పొందవచ్చు అని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చీఫ్ లీగల్ డిఫెన్స్ న్యాయవాది వెంకటేశ్ చెప్పారు. సోమవారం వికారాబాద్ మండలం మహిళా సమాఖ్య కార్యాలయంలో పొదుపు సంఘాల గ్రూప్ సభ్యులకు సంస్థ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయవాది మాట్లాడుతూ.. చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలని చెప్పారు. క్రిమినల్ కేసుల్లో న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేని వారికి న్యాయ సేవా సంస్థ ఉచితంగా అర్హులైన వారికి లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదిని ఏర్పాటు చేస్తుందని తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎడ్ డిఫెన్స్ న్యాయవాది రాము, న్యాయవాదులు రాజశేఖర్, రాజు, పరమేష్, పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి..

అక్షయ పాత్ర వాహనం బోల్తా



బోల్తా పడిన అక్షయ పాత్ర వాహనం

మర్పల్లి: ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో అక్షయ పాత్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటన మండలంలోని మర్పల్లి కుడుగుంట గ్రామ చౌరస్తాలో సోమవారం చోటుచేసుకుంది. అక్షయ పాత్ర మండల కో ఆర్డినేటర్ హరి కథనం మేరకు.. మండలంలోని కుడుగుంట గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం అక్షయపాత్ర నిర్వాహకులు ఆటోలో భోజనం సరఫరా తీసుకెళుతున్నారు. ఈ క్రమంలో చౌరస్తా క్రాస్ చేస్తుండగా ఎదురుగా ద్విచక్ర వాహనం అడ్డు రావడంతో డ్రైవర్ వాహనాన్ని అదుపు చేయలేకపోయాడు. దీంతో వాహనం బోల్తా పడింది.

రూ.30వేలు చెల్లిస్తేనే సర్టిఫికెట్స్

- ఓ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాల యాజమాన్యం
- నేడు ఈ–సెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు చివరి తేది
- ఆందోళనలో విద్యార్థులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని పిగ్లీపూర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాల యాజమాన్యం అదనపు ఫీజుకోసం ఇబ్బందులకు గురిచేస్తుండడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో విద్యాభ్యాసం పూర్తిచేసుకున్నా యాజమాన్యం అదనంగా రూ.30వేలు కట్టాలని సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. కళాశాలలో చేరిన సమయంలో కేవలం రూ.3,100లు తీసుకుని ఉచితంగా సీటు ఇస్తున్నామని చెప్పిన కళాశాల యాజమాన్యం ఇప్పుడు విద్యాభ్యాసం పూర్తిచేసుకున్న తర్వాత సర్టిఫికెట్ల కోసం వెళితే రూ.30వేలు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటున్నారని.. ఈసెట్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు మంగళవారం చివరి తేదీ అని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదు: కళాశాల యాజమాన్యం

విద్యార్థులను ఇబ్బందులు పెట్టాల్సిన ఆలోచన తమకు లేదని.. ప్రభుత్వం విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నేటికీ విడుదల చేయకపోవడంతో విద్యార్థులను డబ్బులు చెల్లించమని కోరాం అని కళాశాల యాజమాన్యం తెలిపింది. ప్రభుత్వం నుంచి ఫీజు రీయంబర్స్‌మెంట్ డబ్బులు రాగానే విద్యార్థుల నుంచి తీసుకున్న డబ్బు తిరిగి ఇస్తామని ఇదే విషయాన్ని విద్యార్థులకు చెప్పామన్నారు.

పెద్ద తండాలో కార్డెన్ సెర్చ్

30 ద్విచక్ర వాహనాలు 2 కార్లు స్వాధీనం

మర్పల్లి: మండలంలోని నర్సాపూర్ పెద్ద తండాలో సోమవారం వికారాబాద్ డీఎస్పీ నర్సింలు కార్డెన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలు, 2 కార్లను స్వాధీనం చేసుకున్నట్లు మర్పల్లి ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో మోమిన్‌పేట్, ధారూర్, వికారాబాద్ సీఐలతో పాటు 50 మంది పోలీసులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

ఆమనగల్లు: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులతో ప్రజలు, వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డా.వెంకటేశ్వర్‌రావు సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడిన అనంతరం ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో జ్వరాలు, కండ్లకలక వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మాస్‌మీడియా అధికారి శ్రీనివాస్, ఆస్పత్రి వైద్యాధికారి డా.పరిక్షిత్ నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్య పరిష్కరించాలి

తాండూరు రూరల్: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారానికి 26వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం కార్మికుల వేతనాలు పెంచాలని, ప్రమాద బీమా రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మద్దతు పలికిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మల్లికార్జున్ ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులో నిరక్ష్యం

నిరసన వ్యక్తంచేసిన రైతులు



కొడంగల్ రూరల్: ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధర్నాకు దిగారు. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు చేయాలని రోజుల తరబడి కేంద్రం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రం ఎదుట రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలిసిన పోలీసులు రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. ట్రాఫిక్ జామ్ కావడంతో సీఐ రాములు నిరసన ప్రదేశానికి చేరుకొని రైతులతో, మరమ్మతు కేంద్ర సిబ్బందితో మాట్లాడారు. రైతుల ఇబ్బందులు తొలగించేందుకు త్వరితగతిన ట్రాన్స్‌ఫార్మర్లకు రిపేర్ చేయించాలని సిబ్బందికి సూచించారు. కొద్ది రోజుల్లో మరమ్మతు చేయిస్తామని సిబ్బంది తెలపడంతో రైతులు నిరసనను విరమించారు.

హుక్కా కేంద్రంపై దాడులు

మహేశ్వరం: గుట్టు చప్పుడు కాకుండా కొనసాగుతున్న హుక్కా సెంటర్‌పై మహేశ్వరం జోన్ ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేసి 25 మందిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎర్రకుంట ప్రాంతంలో అనుమతి లేని చిల్ హుక్కా పార్లర్‌పై ఎస్‌వోటీ పోలీసులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు.

అభివృద్ధి బాటలో పల్లెలు



మహిళలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

'పల్లెబాట'లో షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొత్తూరు: బీఆర్‌ఎస్ పాలనలోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. సోమవారం ఆయన పల్లెబాట కార్యక్రమంలో భాగంగా పెంజర్ల, కొడిచర్ల, ఎస్‌బీపల్లి, సిద్ధాపూర్, వైఎం తండా గ్రామ పంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రూ.5లక్షల జెడ్పీ నిధులతో పెంజర్లలో సీసీ, రూ.10 లక్షల నిధులతో ఎస్‌బీపల్లిలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోందన్నారు. ప్రతి గ్రామానికి బీటీరోడ్డు, అంతర్గత రోడ్ల అభివృద్ధి, తాగునీటి సరఫరా, ప్రభుత్వ పాఠశాలల బలోపేతంతో తదితర అభివృద్ధి పనులు చేపట్టడం మన ప్రభుత్వం ఘనత అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ గణేశ్, జెడ్పీటీసీ సభ్యురాలు ఎమ్మె శ్రీలత, ఇన్‌చార్జి ఎంపీపీ శోభా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాంసుందర్‌రెడ్డి, సర్పంచులు వసుంధర, ప్రభాకర్, తులసమ్మ, ఎంపీటీసీ సభ్యులు , నాయకులు సత్యనారాయణ, లింగంనాయక్, భీమయ్య, దామోదర్‌రెడ్డి, సుధాకర్, బాలయ్య, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'అగ్రి బిజినెస్'కు అవకాశాలు మెండు



అగ్రి బిజినెస్ విద్యార్థులతో డాక్టర్.జీఆర్ చింతల తదితరులు

నాబార్డు మాజీ చైర్మన్ డాక్టర్ జీఆర్.చింతల

చేవెళ్ల: వ్యవసాయ ఆధారిత రంగాల్లో అగ్రి బిజినెస్ విద్యార్థులకు అపారమైన అవకాశాలున్నాయని నాబార్డు మాజీ చైర్మన్ డాక్టర్ జీ.ఆర్ చింతల అన్నారు. మండల పరిధిలోని ఊరేళ్ల సమీపంలో ఉన్న సాగర్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్‌లో సోమవారం అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్‌లో పీజీడీఎం 15వ బ్యాచ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ, వ్యవసాయాధిరిత రంగాల్లో ఉన్న అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. విత్తన, గిడ్డంగి, ఫుడ్ ప్రాసెసింగ్, రవాణా, ఈ కామర్స్ తదితర రంగాల్లో అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాగర్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ డబ్ల్యూఆర్.రెడ్డి, కార్యదర్శి మాలతి, డైరెక్టర్ సురేశ్ గిరిమెళ్ల, డీన్ డాక్టర్ బి.సాహు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ హరీశ్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్ రెడ్డి, డీఆర్‌ఓ సంగీతతో కలిసి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ఫారం 6, 7, 8 ద్వారా ఓటరు నమోదు, డిలేషన్స్, కరెక్షన్స్ చేసుకోవచ్చన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారని, సమ్మర్ రివిజన్‌లో భా గంగా ఆగస్టు 21న డ్రాఫ్ట్ రోల్ పబ్లికేషన్ ఉంటుందని, అక్టోబర్ 4న తుది ఓటరు జాబితా విడుదల చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో మొబైల్ వాహనాల ద్వారా ఈవీఎం యంత్రాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి నియోజకవర్గంలో నిర్వహించే సమావేశాలకు రాజకీయ పార్టీల నుంచి ప్రతినిధులు హాజరయ్యేలా నాయకులు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, బీఆర్‌ఎస్, బీజేపీ, బీఎస్పీ, సీపీఐ, ఎంఐఎం రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం



బాలుడు(ఫైల్)

కొత్తూరు: పాఠశాలకు పంపించేందుకు తీసుకువచ్చిన తీసుకువచ్చిన బాలుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్‌లో సోమవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ జి.శ్రీనివాస్ తెలిపిన ప్రకారం .. బీహార్ రాష్ట్రానికి చెందిన సంతోశ్‌కుమార్ కొన్నేళ్లుగా తిమ్మాపూర్‌లో నివాసం ఉంటూ స్థానికంగా ఉన్న పరిశ్రమలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. స్వగ్రామంలో ఉన్న తన సోదరుడు వీరేశ్ శర్మ కుమారుడు బిట్టు కుమార్(12) పాఠశాలకు వెళ్లకపోవడంతో చదివించేందుకు తిమ్మాపూర్‌కు తీసుకువచ్చాడు. ఈ క్రమంలో బాలుడు జూలై 28న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభ్యమవ్వకపోవడంతో సోమవారం పోలీసులను ఆశ్రయించారు. బాలుడి పెదనాన్న సంతోశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాత పెన్షన్ కొనసాగించాలి



ఆర్డీఓ కార్యాలయంలో అధికారికి వినతి పత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

- సీపీఎస్‌ను రద్దుచేయాలి
- విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి
- తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో కొనసాగుతున్న సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని తపస్ (టీపీయూఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి అన్నారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సంఘం మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. పీఆర్సీ కమిటీ వేసి మధ్యంతర భృతి ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రకటించాలని, ఏరియర్స్‌ను వాయిదాల ప్రాతిపదికన కాకుండా ఏకకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నంబర్ 57ను అనుసరించి 2002–2003 డీఎస్సీద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు వెంటనే ఓపీఎస్‌ను వర్తింపజేయాలని, 317 జీఓతో స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులకు సొంత జిల్లాలకు అవకాశం కల్పించాలని, సూపర్ న్యూమరీ పోస్టులను మంజూరుచేస్తూ స్పౌజ్ అప్పీళ్లు, జీఓ అమలులో తలెత్తిన అన్ని సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఏకీకృత సర్వీసు రూల్స్ ఇతర అంశాలపై ఉన్న కేసులను కోర్టుద్వారా పరిష్కరించి అన్ని కేటగిరీల్లో పదోన్నతులు, బదిలీలను నిర్వహించాలన్నారు. అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్‌లకు, జూనియర్ లెక్చరర్స్‌కు, డైట్ లెక్చరర్స్‌కు ప్రమోషన్లు ఇవ్వాలని, పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్‌ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రత్నారెడ్డి, సత్యం, బాలకృష్ణారెడ్డి, సురేష్‌కుమార్‌గౌడ్, రామకృష్ణ, పతంజలి, రజనీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.